పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇల్లంతకుంట మండలంలోని వెల్జీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇక్కడ అప్పటి సర్పంచులు ఉడుతల వెంకటేశం, గుండ వెంకటేశం, ఉపాధ్యాయులు శివకుమార్, కిషన్, రవీందర్‌రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, రాజయ్య, పూర్వ విద్యార్థులు రేఖ, కరుణాకర్, శృతి, వంశీ, తదితరులున్నారు.
-ఇల్లంతకుంట, అక్టోబర్ 14

'గ్రీవెన్స్ డే' ద్వారా బాధితులకు సత్వర న్యాయం

- ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, అక్టోబర్ 14: ప్రతి ఫిర్యాదుపై బాధితులకు సత్వర న్యాయం అందించేలా గ్రీవెన్స్ డే కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఎస్పీ స్వయంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 16 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్‌చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులపై కఠిన వైఖరి అవలంభిస్తామని పేర్కొన్నారు. గ్రీవెన్ డే ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారులకు దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

రాజన్నకు పోటెత్తిన భక్తజనం

ఆలయంలో స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు

వేములవాడ టౌన్, అక్టోబర్ 14 : దసరా సెలవులు సందర్భంగా రాజన్న ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. సోమవారం కావడంతో వేకువజామునుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తులు క్యూలో ఆలయంలోనికి ప్రవేశించి స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా సుమారు రూ.23 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు, రాజన్నను దాదాపు 40 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, పర్యవేక్షకులు వరి నర్సయ్య, తిరుపతిరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నరేందర్, రాజేందర్, శ్రీనివాస్ రెడ్డి పరిస్థితిని పర్యవేక్షించారు.

దుండగులను శిక్షించాలి

కోనరావుపేట, అక్టోబర్ 14: వరంగల్ జిల్లా దేశాయిపేట గ్రామంలో పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్ అన్నారు. సుద్దాల గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని, విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మాసం సుమన్, దొబ్బల అరుణ్, పరశురామ్, అజయ్, సుధీర్, దిలీప్, రత్నయ్య, రాజు తదితరులున్నారు.

ఏజీపీగా భానుకృష్ణ నియామకం

వేములవాడ టౌన్, అక్టోబర్ 14: వేములవాడ పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పుప్పాల భానుకృష్ణను అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈమేరకు న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లపాటు భాను కృష్ణ ఏజీపీగా కొనసాగుతారు. భానుకృష్ణ నియామకంపై బార్ అసోసియేషన్ కార్యవర్గం, సభ్యులు వారికి అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రుద్రంగి, అక్టోబర్ 14: నూతనంగా డీఎస్సీ 2024 ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులగా ఎన్నికైన ఐదుగురు ఉపాధ్యాయులు గడప వేణు, లింగంపల్లి రవి, శీలం మానస, తర్రె సంగీతను సోమవారం లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇక్కడ లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ సభ్యులు తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు గొడికార్ హిరోజి, సెక్రటరీ బండి యాదగిరి, కోశాధికారి కొమురె శంకర్, లయన్స్ క్లబ్ సభ్యులు గడప రఘుపతిరావు, అంబటి శంకర్, కర్ణవత్తుల దేవేందర్, మంచె రమేశ్, పుట్కపు మహేశ్, మంచె రాజేశం, తదితరులున్నారు.

స్పోర్ట్స్‌క్లబ్ క్రీడాకారులకు..

రుద్రంగి, అక్టోబర్ 14: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన రుద్రంగి స్పోర్ట్స్‌క్లబ్ క్రీడాకారులను స్పోర్ట్స్‌క్లబ్ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఇక్కడ రుద్రంగి స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు గంగం మహేశ్, క్రీడాకారులు అంబటి సాగర్, లింగంపెల్లి రవి, సింగారపు బాబు, అట్టపెల్లి రిషికేశ్, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు కర్ణవత్తుల చందు, తిగుళ్ల శ్రీనివాస్, నారాయణ, రమేశ్, పెద్దులు, అంబటి శ్రీనివాస్, తిరుపతి, గంగాధర్, అశోక్, పీఈటీలు దేవయ్య, రవి తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
కావలెను
jobs Apply Now!
★మ్యారేజ్ బ్యూరో నందు పని చేయుటకు అమ్మాయి కావాలి. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పర్మినెంట్‌గా పనిచేసే అమ్మాయి కావలెను. సంప్ర॥ సెల్: 8341220970
NTK-335282
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, అక్టోబర్ 14: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత వాటిని పరిష్కరించాలని వివరించారు. దరఖాస్తుల పరిష్కారంలో జ్యాపం వద్దని స్పష్టం చేశారు. కాగా సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 27, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 4, ఉపాధి కల్పన శాఖకు 3, ఎస్సీ కార్పొరేషన్, వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖకు రెండు చొప్పున, ఎంపీడీవో తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, సర్వే, అటవీ శాఖ, ఎల్‌డీఎం, మున్సిపల్ సిరిసిల్ల, ఎక్సైజ్ శాఖ, డీసీఎస్‌వో, డీఎస్ సీడీవో, సెస్ శాఖలకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రమేశ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పించండి

పుట్టుకతో మూగ, చెవుడు కలిగిన గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత కలిగిన ఎస్.పవిత్ర కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను తన తండ్రితో కలిసి వచ్చి ఉద్యోగం ఇప్పించాలని వేడుకుంది. కలెక్టరేట్‌లోని ప్రజావాణికి తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన పవిత్ర తన తండ్రి రవీందర్‌రెడ్డితో కలిసి వచ్చి ఏదైనా ఔట్‌సోర్సింగ్‌లో కంప్యూటర్స్ జాబ్ కోసం వినతిపత్రం అందించింది. ఆమె తండ్రి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, తన బిడ్డ పుట్టుకతో చెవుడు, మూగదని అయినా డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్స్ చదివిందని, ఆమెకు ఉద్యోగం ఇప్పించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. కలెక్టర్ సంబంధిత అధికారులకు పరిశీలించాలని కోరారు.

కేసీఆర్‌నగర్ కాలనీవాసుల కష్టాలు తీర్చండి

- కలెక్టర్‌ను కలిసిన డబుల్ బెడ్‌రూం వాసులు

కలెక్టరేట్‌లో కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం కాలనీవాసులు

తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్‌రూం కాలనీవాసులు తమ కష్టాలు తీర్చాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ, కొంతకాలంగా కాలనీలో చెత్త సేకరణ బండి రాక, చెత్తాచెదారంతో దుర్గంధం నెలకొందన్నారు. దోమలు అధికమై అక్కడ నివసిస్తున్న కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి త్వరలో కేసీఆర్‌నగర్ కాలనీవాసుల సమస్యలు తీర్చాలని ఆదేశించారు.

వితంతు పెన్షన్ ఇప్పించండి

సిరిసిల్ల మండలం చిన్నబోనాల గ్రామానికి చెందిన వితంతు వృద్ధురాలు అంబటి బుచ్చవ్వ వితంతు పెన్షన్ ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకుంది. తనకు మతిస్థిమితం కోల్పోయిన కొడుకు ఉన్నాడని తనకు ఎటువంటి ఆధారం లేదని వితంతు పెన్షన్ కోసం వృద్ధురాలు బుచ్చవ్వ కలెక్టర్‌ను వేడుకుంది. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి పెన్షన్ వచ్చేలా చూడాలని ఆదేశించారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షులు

జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు దశరథం, వేములవాడ పట్టణ అధ్యక్షుడు వేణుతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, అక్టోబర్ 14: జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఎన్నికైన బుస్స దశరథం, వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సిద్ధంశెట్టి వేణు సోమవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. వారిని విప్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవోపేతం.. శ్రీనివాసుని బ్రహ్మోత్సవం

సూర్య వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 14: శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జిల్లా కేంద్రంలో వైభవోపేతంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సూర్య వాహనంపై మూడవీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. సుహాసినులు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో హోమం, సదస్సు కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం రంగనాయక తిరుప్పోలంపై స్వామివారిని మూడవీధుల్లో భక్తులు దర్శించుకున్నారు. రాత్రి స్వామివారిని చంద్ర వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆండాళమ్మకు ఒడిబియ్యం

శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు (మంగళవారం) ఆండాళమ్మకు ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే విధంగా సాయంత్రం స్వామి వారిని గజవాహనంపై ఊరేగించనున్నారు.

గంభీరావుపేట, అక్టోబర్ 14: మండలంలోని లింగన్నపేట హరిహర ఆలయంలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఆలయంలో అంకురార్పణ, గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, ప్రాణప్రతిష్ఠ హోమం, బలిహరణం జరిపించారు. మంగళవారం సాయంత్రం హోమం అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా 17న గరుడ సేవ, 18న రథోత్సవంపై భక్తులకు స్వామి వారు దర్శనమిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రధాన రహదారి విస్తరణ ప్రతిపాదన విరమించుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వ్యాపారుల వినతి

వేములవాడ, అక్టోబర్ 14: వేములవాడ పట్టణ ప్రధాన రహదారి విస్తరణ ప్రతిపాదనను విరమింప చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను వ్యాపారులు సోమవారం కలిసి వినతి పత్రం అందజేసి కోరారు. ప్రధాన రహదారి విస్తరణ ద్వారా వేణుగోపాలస్వామి ఆలయం, అరికాల మైసమ్మ ఆలయం కూడా ఉన్నందున పట్టణ ప్రజలతోపాటు భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆయనకు వివరించారు. గతంలో ప్రధాన రహదారిని విస్తరించకుండా పట్టణానికి ఇరువైపులా బైపాస్ రహదారుల నిర్మాణం చేపట్టారని కూడా ఆయనకు గుర్తు చేశారు. రహదారి విస్తరణ చేపడితే 243 దుకాణాల చెందిన వ్యాపారులు రోడ్డున పడే అవకాశం ఉన్నందున ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్ రద్దుచేసి విస్తరణను విరమింప చేసుకోవాలని వ్యాపారులు కట్కం నాగరాజు, కోమ్మ ప్రకాశం, బోడ్ల అశోక్, నిజాం నరేందర్ తదితరులు కోరారు.

బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మతో యువతి

రుద్రంగిలో సద్దుల సంబురాలు

- వేడుకలకు హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

రుద్రంగి, అక్టోబర్ 14: దసరా పండుగ అనంతరం బతుకమ్మ పండుగను రుద్రంగిలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. సోమవారం మహిళలు బతుకమ్మలను తంగేడు, గునుగ, పట్టకుచ్చు ఇలా తీరొక్క పూలతో అందంగా పేర్చి గ్రామంలోని ప్రధాన కూడళ్లల్లో ఉంచి బతుకమ్మ, కోలాటాలు ఆడారు. అనంతరం మహిళలు గ్రామ శివారులోని బతుకమ్మ కుంటలో పోయిరా గౌరమ్మ.. పోయిరా.. అంటు పాడుతూ నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలో బతుకమ్మ పండుగకు కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నం సద్దుల బతుకమ్మ పండుగని తెలిపారు. కాగా, బతుకమ్మ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ ఎంపీపీ గంగం స్వరూపారాణి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత, మాజీ ఎంపీటీసీలు మంచె లావణ్య, చెప్యాల రవళిక, జమీలాబేగం, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆస్ట్రియాలో బతుకమ్మ సంబురాలు

వేములవాడ రూరల్, అక్టోబర్ 14 : సద్దుల బతుకమ్మ వేడుకలను ఆస్ట్రియాలోని వియన్నా నగరంలో ప్రవాస భారతీయులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడ తెలంగాణ ఆడపడుచులున్నారు.

వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత మధు జన్మదిన వేడుకలు

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 14: బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు జన్మదిన వేడుకలను సోమవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమంలో బీఆర్ఎస్ నేతలు నిర్వహించారు. ఈసందర్భంగా వృద్ధులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్‌వై జిల్లా నేత సిలువేరి చిరంజీవి, సయ్యద్ ఆఫ్రోజ్, బండి శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, చింతమడక బాబు, ఆకారపు కృష్ణ, శ్రీకాంత్, బాబు, వినోద్, వేణు, జక్కుల శ్రీనివాస్, రాకేశ్, వంశీ, సిద్దు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

గంభీరావుపేట, అక్టోబర్ 14: మండలంలోని ముస్తాఫానగర్ అంగన్‌వాడీ టీచర్ భారతమ్మ రెండు రోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందగా, డీడబ్ల్యూవో అధికారి లక్ష్మీరాజం సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 వేల చెక్కును అందించారు. ఇక్కడ జిల్లా అంగన్‌వాడీ అధికారులు, టీచర్లు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హమీద్ తదితరులున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 14: తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు జంగపల్లి బాబు (26) గుండెపోటుతో మృతి చెందాడు. దసరా పండుగ రోజు కుటుంబసభ్యులతో ఆనందంగా గడిపిన యువకుడు బాబుకు సోమవారం ఉదయం హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా దవాఖానకు చేరేలోపు మృతి చెందాడని వైద్యులు తెలపడంతో బోరున విలపించారు. బాబు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బాబుకు తండ్రి శ్రీనివాస్, తల్లి ఎల్లవ్వ, చెల్లెల్లు మౌనిక, అశ్విత ఉన్నారు.

కరాటే మాస్టర్ మన్నాన్‌కు తైక్వాండోలో బ్లాక్‌బెల్ట్

వేములవాడ టౌన్, అక్టోబర్ 14 : వేములవాడ పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ మన్నాన్‌కు హైదరాబాద్‌లో జరిగిన కరాటే గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి తైక్వాండో కరాటే అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా బ్లాక్‌బెల్ట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మన్నాన్ మాట్లాడుతూ, 30 సంవత్సరాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వందలాది మంది బాల బాలికలకు శిక్షణ ఇస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి, ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో మెడల్స్ సాధించామని తెలిపారు.

రాజన్నను దర్శించుకున్న పీఎస్సీ చైర్మన్

వేములవాడ టౌన్, అక్టోబర్ 14 : వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని సోమవారం పీఎస్సీ చైర్మన్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేయగా, ప్రధానార్చకుడు రాజేశ్వరశర్మ వారికి స్వామివారి శేష వస్త్రం కప్పి, ప్రసాదాన్ని అందజేశారు. ఇక్కడ ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, గిరి, ప్రొటోకాల్ ఇన్‌చార్జి సింహాచారి ఉన్నారు.

మరణంలోనూ వీడని స్నేహం

- దుర్గామాత నిమజ్జనానికి వెళ్తుండగా.. అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన బైక్
- పండుగపూట ఇద్దరు స్నేహితుల మృతి
- హన్మాజీపేట గ్రామంలో విషాదం

సూర అనిల్, వికృతి దిలీప్ (ఫైల్)

వేములవాడ రూరల్, అక్టోబర్ 14: వారిద్దరూ స్నేహితులు. దుర్గామాత నిమజ్జన వేడుకలకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తున్నారు. అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరూ అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటకు చెందిన వికృతి దిలీప్(22), సూర అనిల్(21) ఆదివారం రాత్రి గ్రామంలో జరిగిన దుర్గామాత నిమజ్జన వేడుకలకు హాజరయ్యారు. ఆ తర్వాత అర్ధరాత్రి 12.45గంటల ప్రాంతంలో మామిడిపల్లిలో దుర్గామాత నిమజ్జన వేడుకల కోసం బైక్‌పై బయలుదేరారు. బొల్లారం శివారుకు చేరుకోగానే, మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మారుతి తెలిపారు.

పండుగపూట విషాదం

వికృతి రాజేశం-జూలి దంపతులకు దిలీప్ ఒక్కగానొక్క కొడుకు. రాజేశం గత బుధవారమే గల్ఫ్ వెళ్లాడు. తల్లి గ్రామంలో అంగన్‌వాడీ టీచర్. దిలీప్ హైదరాబాద్‌లో చదువుతుండగా, రాయల్ ఎన్‌ఫీల్డ్-650 బైక్ కావాలని కోరగా.. నాలుగు రోజుల క్రితమే అప్పుచేసి వాహనాన్ని కొనుగోలు చేశారు. సూర అంజయ్య-రాధకు ముగ్గురు కుమారులు కాగా, అనిల్ మూడోవాడు. హైదరాబాద్‌లో ఉంటున్న అన్న వద్దకు వెళ్లి జాబ్ చేయాలని నిర్ణయించుకోగా, అంతలోనే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. పండుగపూట ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొన్నది. గల్ఫ్‌లో ఉన్న దిలీప్, అనిల్ తండ్రులు నేడు స్వగ్రామం వస్తున్నారని.. వారు వచ్చిన తర్వాతే అంత్యక్రియలు జరిపించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు ఉపాధ్యాయలకు కౌన్సెలింగ్

తెలంగాణ చౌక్, అక్టోబర్ 14: డీఎస్సీ ఉపాధ్యాయ ఫలితాల్లో ఎంపికైన ఉపాధ్యాయలకు నేడు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో రమేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లోని ఆడిటోరి యంలో కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

స్వయం ఉపాధి ఎంచుకోవాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 14: మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకుని సాధికారత సాధించాలని ఏడీ ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. సోమవారం హరిదాస్‌నగర్‌లో ఇందిరా మహిళా శక్తిలో భాగంగా బ్యాంకు లింకేజీతో మంజూరైన కోడి పిల్లలను శ్రీకాంత్ బ్యాక్‌యార్డు మదర్ యూనిట్‌కు పంపిణీ చేశారు. ఇక్కడ డీపీఎం పద్మయ్య, ఏపీఎం మల్లేశం తదితరులున్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు

రుద్రంగి, అక్టోబర్ 14: రుద్రంగి మండలం మానాల గ్రామం నుంచి రుద్రంగి వైపు వస్తున్న కారు సోమవారం సాయంత్రం రుద్రంగి గ్రామ శివారులోని రైస్‌మిల్ వద్ద అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. కారులో డ్రైవర్ ఒక్కడే ఉండడంతో ప్రమాదం తప్పింది. గ్రామస్తుల సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీసుకువచ్చారు. ప్రమాదంలో అతడికి ఎలాంటి గాయాలు కాలేదు.

వరి పరిశీలన

ఇల్లంతకుంట, అక్టోబర్ 14 : మండలంలోని పొత్తూరు గ్రామంలో వరిని క్షేత్ర స్థాయిలో జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి సోమవారం రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు సాగు చేస్తున్న చిరు సంచి దశలో ఉన్న వరి వంగడాలైన జేజీఎల్ 28639, ఆర్ఎన్ఆర్ 31479, డబ్ల్యూజీఎల్ 1537, డబ్ల్యూజీఎల్ 1380, ఆర్ఎన్ఆర్ 35008, కేఎన్ఎమ్12368 రకాల వరి పైరులను సందర్శించామన్నారు. కార్యక్రమంలో ఏఈవో లతతోపాటు రైతులు పాల్గొన్నారు.

వడ్ల కుప్పను ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

తెలంగాణ చౌక్, అక్టోబర్ 14: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటకు చెందిన వేముల రాజశేఖర్ ఆదివారం అర్ధరాత్రి రోడ్డుమీద ఉన్న వడ్లకుప్పను ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయని టౌన్ సీఐ కృష్ణ పేర్కొన్నారు. వివరాల ప్రకారం, రాజశేఖర్ సర్దాపూర్‌లో వ్యక్తిగత పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణంలో సిరిసిల్ల రెండవ బైపాస్‌లో రోడ్డుపై రైతులు పోసిన వడ్లకుప్ప పైకెక్కడంతో కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన చిన్నబోనాల గ్రామానికి చెందిన రైతు సరుగు భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించగా అప్పటికే కోమాలోకి వెళ్లగా వెంటిలేటర్‌పై ఉన్నట్